# ముసుగు

నెలాఖరు—ఆదివారము—ఇంకో రెండు రోజులు పోతేనేగాని జీతంరాదు. హోటలు భోజనానికి ఒక్క టికెట్టు మాత్రమే మిగిలింది. ఆ మధ్య స్నేహితులు రావడాన-గొప్పకోసము కాక పోయినా సామాన్యంగా వుండే స్నేహ ధర్మాన్ని నెరవేర్చుకున్నందుకు కొన్ని టికెట్లు ఖర్చు అయిపోయాయి. ఈ రెండు రోజుల భాగ్యానికి అప్పు చేయడం (ఎంత కొంచమయినా) ఇష్టములేదు.

నేనుంటున్న గదిని చూసి చాలామంది సన్నిహితులు నన్ను అభినందిస్తూ ఉంటారు. పోష్ "లొకాలిటీ"లో ఈ మహానగరములో నా అదృష్టముకొద్ది చిన్న గది దొరికింది. దానికే నలభై రూపాయలు. నా మంచితనంవల్ల ఆ గది దొరికిందని అంటూ వుంటారు. తాజమహల్ హోటల్లో భోజనం. ఆఫీసుకు వెళ్ళటానికి కష్టార్జితములో మిగుల్చుకొని కొనుక్కున్న వాహనము ఉంది. అది నా హెర్క్యులెస్ సైకిలు నమ్మినబంటు. ఈ వాహనం కోసము ఒక్కొక్కప్పుడు ఒక పూట భోజనము చేసి డబ్బు మిగుల్చుకోవాల్సి వచ్చింది. నా కొచ్చే జీతము చాలా జాగ్రత్తగా బడ్జెట్టు తయారుచేసి దాని ప్రకారము ఖర్చు చేస్తే బొటాబొటిగా సరిపోతుంది. జీతము వచ్చిన రోజున అంచనా ప్రకారం కనీసము పది పదిహేను రూపాలన్నా ఆ నెలలో మిగులుతుందని అని

పిస్తుంది. ఆ డబ్బు ఎలా ఖర్చు అవుతుందో తెలియదు. అప్పు చేయడము మొదలు పెడితే దానికి అంతువుండదు. పెరిగి పెరిగి ఆకాశాన్ని అంటుతుంది. నా తాహాతుమించి అప్పు చేయడము ఇష్టముండలేదు. మన దేశము తిండి గింజలకు కూడా అప్పుచేసి పప్పుకూడు తినడం చూస్తూ వుంటే నా కడుపు తరుక్కుపోతోంది. అప్పుల్లో గొంతు వరకు మునిగి వున్నాము. నిండా మునిగిన వానికి చలిబాధ తెలియదు. నేను నీళ్ళలోకే అడుగు పెట్టడానికి సందేహిస్తాను. చలి అసలు భరించలేను.

నేను ఉంటూన్న వీధిలో ఇరువైపుల పెద్ద భవంతులు. భవంతుల్లో కార్లు పెట్టుకోడానికి నాజూకుగా తయారయిన గారేజీలు నా "రూమ్" గ్యారేజీలో సగము వుంటుంది. చిన్న ఊళ్ళలోవుండే "ముటు" గదికన్నా కొంచెము చిన్నది. ఆ భవంతులలో కార్లలో వెళ్ళే ఆఫీసర్లూ, కాలేజీలకు వెళ్ళే అమ్మాయిలూ (అందమైన) కాన్వెంటులకు వెళ్ళే పిల్లలూ... వాళ్ళను సంరక్షిస్తున్న ఆయాలూ ... నౌకర్లూ. ఎప్పుడూ అందరూ హడావిడిగానే వుంటారు.

పల్లెటూళ్ళలో అయితే పక్కనున్న వాళ్ళెవరో తెలుస్తుంది. అప్పుడప్పుడు వచ్చి మంచీ చెడ్డా కనుక్కొంటూ వుంటారు. ఈ మహానగరములో పక్కనున్న వాళ్ళు ఎవరెవరో ఎవరికేం చేస్తుంటారో తెలియదు. మా వీధిలో చివర భవంతి మరీ హడావుడిగా వున్నట్టు కనపడతాది.

ఆదివారం ఉదయం పేపరు చూస్తూ కూర్చున్నాను.

పేపరుకు ప్రతినెలా కొంతడబ్బు ఖర్చయినా - పేపరు కొన కుండా ఆ డబ్బు ఆదా చేయడము నా కిష్టములేదు. పేపర్లో చాలా సంగతులు ఉంటాయి. మంచి మంచి విషయాలున్న పేపర్లు అలాగే వుంచేస్తాను. నా రూమ్‌కు రాగానే ఎవరి కయినా ఎదురుగా పేపర్ల కట్టలే స్వాగతం చెప్తాయి.

పేపరు చదువుతుంటే నాకో ఆలోచన మెరుపల్లే మెరిసింది! పాత పేపర్ల కట్టలన్నీ అమ్మితే కొంతడబ్బు వస్తుంది. యీ రెండురోజులూ గడిపేయవచ్చు అను కొన్నాను- కాని మరో క్షణంలో ఎంత పతనానికి దిగజారేను అనిపించింది - ఏదైనా అవి అమ్మడానికే నిశ్చయించు కొన్నాను.

పేపరు కాగితాల్... అని అరుస్తూ అప్పుడప్పుడు యీ వీధిన ఒక సైకిల్ మీద వెళ్ళుతుంటాడు. వాడు వస్తే బాగుండుననిపించింది. వాడి వృత్తి అదే అయినప్పుడు తప్ప కుండా వస్తాడు. ఈ రోజు ఆదివారము కనుక సందేహాము లేదు. వాడి కేక కోసము నిరీక్షిస్తూ కూర్చున్నాను. మన అవసరం వున్నప్పుడే ఆలస్యం జరుగుతుంది. నాకు వేరే పనేంలేదు. ఎంతసేపయినా కూర్చుంటాను. పేపర్లో ఓ కొత్త వ్యాసం చదువుతున్నాను. ముసలితనం రాకుండా వుండేందుకు శాస్త్రజ్ఞులు కనిపెట్టిన కొన్ని మార్గాలు ముసలితనాన్ని ఒక వేళ జయించినా మృత్యువును నయించలేదు. ముసలితనం వస్తే శాస్త్రజ్ఞులుకు నష్టమేమిటో పుట్టినవాడు గిట్టక మానడు. బాల్యం, యౌవ్వనం, కౌమారం, వానప్రస్తం...

యీ నాలుగూ ఎవ్వరికీ తప్పవు. ప్రకృతికి విరుద్ధంగా పోవడం దేశానికి అరిష్టం. ముసలితనం రాకుండా వుంటే ఎవరూ రిటైర్ అవరు. ఎవ్వరికి ప్రమోషన్‌లకి అవకాశం వుండదు. అన్నాళ్ళు బ్రతికితే బ్రతుకుమీదే రోతపుడుతుంది. అన్నాళ్ళు బ్రతికి యెవరిని ఉద్ధరించడానికి కోడి నరాలలోని మందు ఇంజక్షన్‌గా వాడితే శరీరములో కొత్తరకమైన తేజస్సు వస్తుంగట. ఇదో కొత్తథియరీ! శాస్త్రజ్ఞులకు పనీ పాటా లేక ఇట్లాంటివి కనిపెడుతూ ఉంటారు. ఎన్నాళ్ళకీ ముసలితనము రాకపోతే... (మగవాళ్ళకు) యీ ఆడవాళ్ళు పడే అవస్థ అంతా ఇంతా కాదు. ముసలితనంలోని మాధుర్యాన్ని అనుభవించలేరు, యవ్వనములో ఆనందము ఉన్నదని అనుకున్నా - ఏదైనా తీపి ఎక్కువగా ఉంటే దాని రుచి తెలియదు. చేదుగా కూడా ఉంటుంది.

ముసలితనాన్ని గురించి నేను చర్చించుకుండే సమయములో పేపరువాడి కేక విన్పించింది. వాడి కేక తమాషాగా వుంటుంది. కాగితాల్ అన్నది స్పష్టముగా వినపడదు గుమ్మంలో నిల్చుని కేక వేశాను.

వాడి సైకిలు వెనకాల పెద్దగోనె సంచీవుంది. కొన్ని డబ్బాలు సీసాలు కూడా వున్నాయి. దాంట్లో కొన్ని పేపర్ల కట్టలు. కొబ్బరినూనె సీసాతప్ప నా రూములో ఏం సీసాలు లేవు. పేపర్లన్నీ తూకం వేశాడు. మూడు కిలోలపైనే వున్నాయి. వాడి దగ్గర బేరము ఆడకుండా డబ్బు తీసుకున్నాను. గోనెసంచి చాలా బరువుగా వుంది. దాని నిండా

సీసాలే అన్నాడు వాడు. ఆ సీసాలు చూద్దామని పించింది. ఏదైనా అందమైన సీసా వుంటే కొందామని నా కోరిక మన్నించి గోనెసంచీ విప్పేడు. నా కళ్ళు చెదిరినై రకరకాల సీసాలు వాటిమీద లేబిల్సుకూడా వున్నాయి. బీర్ సీసాలు, విస్కీ-సీసాలు, ఇంకా ఎన్నో వాటిలో కొన్ని ఫారిన్ సీసాలట. ఎంతో నాజూకుగా వున్నాయి. ఇన్ని సీసాలూ ఒకరింట్లోనే కొన్నాడు. యీ వీధిలోనే చివరి భవంతిలో ఆ భవంతిలోనే హడావుడిగా వుంటుంది. వచ్చేవాళ్ళూ, పోయేవాళ్ళూ...ఇంకా డబ్బాలుకూడా వున్నాయి. ఫినైల్ డబ్బాలూ-డాల్డా డబ్బాలూ...సీసాలు ప్రతిరోజూ వచ్చి కొనుక్కుపోతానని చెప్పాడు.

ఇన్ని సీసాలు త్రాగేవాళ్ళు. ఆ భవంతి లోనివాళ్ళు ఎంతధనవంతులోకదా అనుకున్నాడు. ధనవంతులంటే నాకేం కోపములేదు. ఎవరి అదృష్టం వాళ్ళది వాళ్ళను గురించి నాకేం "జెలసీ" లేదు. ప్రతిరోజూ ఈ సీసాలమీద యెంతడబ్బు తగలెస్తున్నారో అని నా బాధ వాళ్ళ ఆదాయము కొన్ని వేలల్లో వుండివుండాలి. అలాంటివాళ్ళే అంత ఖర్చు భరించగలరు.

ఆ భవంతి గురించిన వివరాలు తెలుసుకోవాలెనని కుతూహలము కలిగింది. మళ్ళీ అనవసరపు జోక్యము నా కెందుకనిపించింది. కాని కుతూహలమే నన్ను జయించింది. సాయంత్రము ఎక్కడికీ వెళ్ళకుండా గుమ్మములో కూర్చు

న్నాను జపం చేస్తున్నట్టుగా చీకటిపడుతూ వుంది. రెండు కార్లువచ్చి భవంతిముందు ఆగినవి... కార్లలోంచి అందమైన ఆడవాళ్ళూ - మామూలుగా వున్న మొగవాళ్ళు... పకపకలో దిగి లోపలికు వెళ్ళేరు కార్లు వెళ్ళిపోయి మరల వచ్చినవి. మరల వెళ్ళి మరల వచ్చినవి ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఏదో నవల చదువుతూ కూర్చున్నాను. రాత్రి పన్నెండు దాటింది. వీధి అంతా నిశ్శబ్దముగావుంది. మరల కారు చప్పుడయింది. భవంతిలోని కుక్క అరుపు కూడా వినిపించింది. ఒకరోజు సాయంత్రము భవంతిముందు గేటు మీద బోర్డు చూశాను. "కుకకలున్నవి జాగ్రత్త" అని వున్నది.

మళ్ళీ ఆదివారమునాడు సీసాల వాడు కనిపించాడు. సీసాలవాడిని అడిగితే వివరాలు తెలుస్తాయి వాణ్ణి అడగడానికి నాకు చిన్నతనమనిపించింది. వాడికి సీసాల బేరము తప్ప మరోటి తెలియదు.

ఆ రోజు సాయంత్రము కారులో దిగుతున్న అమ్మాయిని ఓ రోజు బస్టాండు దగ్గర చూసేను. సైకిలు దిగి ధైర్యము చేసి మాట్లాడుదా మనుకున్నాను. ధైర్యము చాల్లేదు. వాడిపోయిన మొఖము అది చూసి ఏదైనా ఆఫీసులో ఉద్యోగము చేస్తున్న దేమోననుకున్నాను.

ఒకరోజున ఏదో పండుగకు శెలవరోజు పోస్టు బంట్రోతులూ, టెలిఫోను బంట్రోతులూ, పోలీసు కానిస్టేబిలూ, మ్యునిపల్ జవాన్లూ...ఇంకా చాలామంది ఆ భవంతికి వచ్చి

పోతున్నారు, బహుశ పండుగ ఈనామువుకై ఉంటుంది. వచ్చిన వాళ్ళందరూ సంతోషంగానే వెళ్ళిపోతున్నారు. నేను కూడా ఏ బంట్రోతు వేషమో వేసుకుని వెళితే బావుండు ననిపించింది. వాళ్ళ ఉత్సాహం చూస్తుంటే.

ఒకరోజు నా స్నేహితునితో మార్కెట్టు వెళ్ళేను. అక్కడ ఆ భవంతిలో వుంటున్న ఒక ముసలామె కనిపించినది. బోలాకూరలూ కోడిగుడ్లూ...కోళ్ళూ ... కొంటున్నది. అవన్నీ మోసుకురావడానికి ఒక బలాఢ్యుడు కూలికోసం వేచివున్నాడు. ఆమె కూరగాయల బేరము పెద్దఎత్తున చేస్తోంది. ఆమె వెళ్ళిపోయింతర్వాత ఆ కూరలవాణ్ణి అడిగేను. కుతూహలముగా సామాన్యకుటుంబానికి అన్ని కూరలు ఎవరుకొనరు. ఏదో హోటలయితే తప్ప...ఏదో హోటలులాంటిదేనండీ అని వాడు అన్నాడు హోటలయితే నేను చేరుదునే అనుకున్నాను.

వివరాలు ఒకటితర్వాత ఒకటి తెలిసి నప్పటినుండీ నాలో కుతూహలము యెక్కువయింది. ఎలాగైనా ఒకసారి ఆ భవంతికి వెళితే బావుండుననిపించింది. న్యూ ఇయర్ డేన ధైర్యము చేశాను. నన్ను నేను పరిచయము చేసుకుని స్వయముగా ఆ యింటియజమానికి శుభాకాంక్షలు అందజేద్దామనుకున్నాను. ఇందులో తప్పులేదు. ఎవ్వరూ అపార్థం చేసుకోరు. నాకున్న దుస్తులలో మంచివి పరిశుభ్రమైనవీ వేసుకుని, ధర ఎక్కువయినా ఒక "యాపిల్" పండుకొని

బయలుదేరాను. ఆ బోర్డుచూసి కొంచెం భయపడి... వెళ్లామా వద్దా అని తటపటాయిస్తున్నాను. ఇంతలో అందంగా నాజూకుగా వున్న అమ్మాయి...ప్లీజ్ కమిన్... అన్నది' విష్ చేస్తూ లోపల ప్రవేశించాను. నేను కార్లో రాలేదని నన్ను ఎగాదిగా చూసినట్లుగా ఉంది. డ్రాయింగు రూములో కూర్చున్నాను. ఫర్నిచర్ ఆధునాతనంగా వుంది. గోడలకు అందమైనఫోటోలు మరో ఇద్దరు అమ్మాయిలు కని పించారు. కళ్ళుజిగేల్ మనేట్టున్నారు.నన్ను నేను పరిచయము చేసుకున్నాను. అందరూ చాలా ఆప్యాయంగా చిరునవ్వు లతో ఆదరించారు. చాలా రుచికరమైన కాఫీ అందు కున్నాను నా వివరాలు యెక్కువ చెప్పలేదు. నా డ్రస్సును బట్టి ఏదో ఆఫీసరుననే అనుకుని వుంటారు. హోటలులో భోజనం చేస్తున్నానని మాత్రం తెలియజేశాను...హోట లుని విమర్శించుతూ...మీరు ఇక్కడే ఇందుకు వుండ కూడదూ "పేయింగుగెస్టు"గా అన్నది నవ్వుతూ ఆ అంద మయిన అమ్మాయి "తప్పకుండాను...సంతోషంగా...అని అందామనుకున్నాను. మాటజారేముందు నెలవారిబిల్లు ఎంతో తెలుసుకుంటే బావుంటుంది. అతినాగరిక విధా నములో వాళ్ళని హెచ్చరించాను. నేను వయసులోవుండి ఆకర్షణీయంగానే ఉన్నట్టు వాళ్ళకళ్ళల్లో ఒకవిధమయిన తృప్తికన్పించింది. షుమారు నాలుగువందలవరకూ అవు తుందని మాటలసందర్భంలో చెప్పారు. నాకది "షాక్"లా

తగిలినా తమాయించుకుని "కాఫీ ఈజ్ ఎక్సలెంట్" అన్నాడు. నాజూకుగా "థ్యాంక్ యు" అన్నారు వాళ్ళు. ఇంతలో వాకిట్లో కారు ఆగిన చప్పుడయింది క్షమించాలి నేను శలవు తీసుకుంటాను. మళ్ళీ కలుస్తానని బయటపడ్డాను. "బోర్డు" వంక మరోసారి చూస్తూ ! ! !

నేనూ, నా తాజమహాలూ మిగిలేం.

చు క్కా ని

... * * * ...